


నూకల్ని జాగ్రత్తగా ఎండబెట్టుతున్నాము. కాని, ఆ 20 కిలోగ్రాముల నూకల్తో పాటుగా ఆ బస్తాలో ఉన్న నూకలు అన్నీ పుచ్చిపోయి, తుట్లుపట్టి క్రిమి కీటకాదులతో నిండి నిబిడీకృతమై ఒకానొక దుర్గంధబంధుర విషపూరిత జుగుప్సాకరమైన వాయువు బయలుదేరుచున్నది. క్రిమి కీటకాదులకు తప్ప, మనుష్యులకు కాని, అథవా పశుపక్ష్యాదులకు కాని తినడానికి యోగ్యం కాదు. దానివల్ల అంటు

"చీఫ్ డివిజనల్ ఆఫీసరు వారికి...
అయ్యా,

ఆహార ధాన్య సేకరణ లేఖ నెం. 18311/2/ నూకలు తారీఖు 2 మార్చి నెల 1983 ప్రకారం నాల్గవ పేరాలో ఉదహరించబడ్డ మేరకు కొన్న ఆహార ధాన్యాలలో అయిదవ షెడ్యూలు ప్రకారం సేకరించిన 'నూకల' వైనం తమ దృష్టికి తేగోరుతున్నాను.

నూకలు నూరు బస్తాలు గొడౌన్‌లో భద్రపరచబడ్డాయి. కాని. అందులో ఒక బస్తా రైల్వే వాగన్‌లో రహస్యంగా ప్రవేశించిన తేమలో తడిసి ముద్ద అయిపోయినట్లు కనబడుతున్నది. ఆ బస్తాలో దాదాపు 20 కిలోగ్రాముల నూకలు సదరు తేమవల్ల చెడిపోయాయని తెలియజేయడానికి మిక్కిలి చింతిస్తున్నాము. దాని గురించి అయోమార్గం వారికి నష్టపరిహారార్థం కాగితాలు దాఖలు చేసే ఉన్నాము.

ఇప్పుడు ఈ చెడిపోయిన 20 కిలోల నూకలను ఏమి చేయమని తమ సలహా?

తమ సలహా నిమిత్తమై అత్యాతురతతో నిరంతరం నిరీక్షించు—

భవద్విధేయుడు,
- అసిస్టెంట్ డివిజనల్ ఆఫీసర్
15 మే 1983

×× ×× ××

టెలిగ్రామ్ ...
'అసిస్టెంట్ డివిజనల్ ఆఫీసర్‌కి . . .

వెంటనే నూకల్ని ఎండబెట్టించి, తరువాతి పరిణామాలు అర్జెంటుగా తెలుపుతూ తక్షణం నివేదిక అందజేయవలెను.

—చీఫ్ డివిజనల్ ఆఫీసర్"
18 జులై 1983

×× ×× ××

టెలిగ్రామ్ . . .
"చీఫ్ డివిజనల్ ఆఫీసరు వారికి...

తమ ఆర్డర్సు ప్రకారం నూకలు ఎండబెట్టించి లాభం లేదు. బాగా నానిపోయాయి. తేమ బాగా జీర్ణించిపోయింది. ఎండబడవేమో అని మా అనుమానం. ఏం చెయ్యమని శెలవు?

- అసిస్టెంట్ డివిజనల్ ఆఫీసర్."
28 జులై 1983

×× ×× ××

ఎక్స్‌ప్రెస్ టెలిగ్రామ్ . . .
"అసిస్టెంట్ డివిజనల్ ఆఫీసర్‌కి...

ఆర్డర్సు పాటించి తీరవలెను. వెంటనే ఎండబెట్టి పర్యవసానం నివేదిక పంపవలెను.

—చీఫ్ డివిజనల్ ఆఫీసర్."
12 సెప్టెంబర్ 1983

×× ×× ××

లేఖ . . .
"చీఫ్ డివిజనల్ ఆఫీసర్ వారికి...
అయ్యా,

తమ ఆర్డర్సు ప్రకారం రోజూ ఆరుబయట ఒక కాపలాదారు పర్యవేక్షణకింద ఎండలో

వ్యాధులు కూడా వ్యాపించి, వాతావరణాన్ని కలుష ప్రపూరితంగా చేస్తాయేమో అన్న చిన్న సందేహం కూడా లేకపోలేదు. ఈ సంకట పరిస్థితులలో ఏమి చేయవలెనో మాకు అగమ్యగోచరంగా ఉంది. మీ సలహా అతి అర్జంటుగా తెలియ జేయమని అభ్యర్థన.

మి సలహాకోసం అనుక్షణమూ ఆవేగహృదయంతో ఎదురుచూస్తున్న . . .

భవద్విధేయుడు

- అసిస్టెంట్ డివిజనల్ ఆఫీసర్."

18 సెప్టెంబర్ 1983

×× ×× ××

లేఖ . . .


"అసిస్టెంట్ డివిజనల్ ఆఫీసర్‌కి,

అంత ఘోరప్రమాద కంటక కర్కశ దుర్గమ సంకట పరిస్థితిలో నూకల స్థితి ఉండగా,

# కార్యాలయ పత్రప్రహసనం

## రామవరపు వేణుగోపాలరావు






నాగిశెట్టి

రు. 116 లు బహుమతి పొందిన కార్టూన్

ఒక ఎక్స్‌ప్రెస్ టెలిగ్రామ్ ఇవ్వడానికి బదులు తాపీగా, నిదానంగా, సావకాశంగా జాగుచేస్తూ లేఖ రాయడాన్ని మేము ఖండిస్తున్నాము.

తర్వాత నూకల పరిస్థితులు నిజంగా మీరు తెలియజేసినంత విషాద విషమావస్థలో ఉంటే, మీరు హెల్త్ ఆఫీసర్ వారికి టెలిగ్రామ్ మూలంగా తెలియజేసి, వారిచేత సర్టిఫికెట్టు పొందడం గురించి తగిన చర్యలు తీసుకోకపోవడం చాలా శోచనీయం.

నూకలు ఉన్న గోనె సంగతి ఏమైనది? అడిగిందాకా గోనె సంగతి చెప్పకపోవడాన్ని కూడా మేము హర్షించలేకుండా ఉన్నాము.

టెలిగ్రామ్ పంపనందుకు, హెల్త్ ఆఫీసర్ గారికి తెలియజెయ్యనందుకు, గోనె వివరములు అందజెయ్యనందుకు మీ సంజాయిషీని పంపిస్తూ, ఎగువ వివరించిన చర్యలను సత్వరంగా తీసుకొని, అప్పటి కుత్పన్నమయిన పరిస్థితుల దృష్ట్యా నివేదికా రూపంగా లేఖను కాని, టెలిగ్రామ్ కాని, ఎక్స్‌ప్రెస్ టెలిగ్రామ్ కాని పంపవలెను.

—చీఫ్ డివిజనల్ ఆఫీసర్."

3 అక్టోబర్ 1983

×× ×× ××

ఎక్స్‌ప్రెస్ టెలిగ్రామ్ . . .

"చీఫ్ డివిజనల్ ఆఫీసర్ వారికి...

హెల్త్ ఆఫీసర్ గారికి టెలిగ్రామ్ ఇచ్చి నెల రోజు లయినది. రెండు రిమైండర్లు కూడా ఇచ్చినాము. వారు రాలేదు. ఏమీ సమాచారం కూడా తెలియదు. పూర్తిగా గోనె పాడయిపోయింది. ఇది తమ దివ్య చిత్తమునకు తేవడమైనది.

—అసిస్టెంట్ డివిజనల్ ఆఫీసర్."

4 డిసెంబర్ 1983

×× ×× ××

లేఖ . . .

"అసిస్టెంట్ డివిజనల్ ఆఫీసర్‌కి...

తగిన బలవత్తరమయిన కారణం లేకుండా, తీసుకున్న చర్యలేమీ ఫలించకుండా, అనవసరంగా ఎక్స్‌ప్రెస్ టెలిగ్రామ్ పంపినందుకు మీకు ఏల ఛార్జిషీటు (నేరారోపణ పత్రం) ఇవ్వకూడదో తిరుగు టపాలో తెలియజెయ్యవలెను. ఏ సందర్భంలో టెలిగ్రామ్ పంపవలెనో, ఏ పరిస్థితిలో లేఖ రాయవలెనో గుర్తించి తదనుగుణంగా నడుచుకోవలసిందని ఇందుమూలంగా మరొకసారి తీవ్రంగా హెచ్చరించడమైనది.

గోనె పాడయిపోయిందని మాత్రమే తెలియజేశారు. వివరములు సాకల్యంగా తెలియజేయడం అత్యవసరమని మీకు తోచకపోవడం చాలా ఆశ్చర్యకరం! దురదృష్టకరం!! వెంటనే పూర్తి వివరములు అందజేయవలెను.

ప్రతి విషయమునకూ పూర్వాపర సందర్భాలూ, తగు వివరణ, కొంత విపులీకరణ, తత్తదుచిత వ్యాఖ్యానం, అవసరమయిన రిమార్కులూ అవీ ఉండడం అత్యావశ్యకమని తెలుసుకోవలసింది. ముందు ముందు ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేటప్పుడు ఈ విషయాలన్నీ దృష్టిపథంలో తప్పకుండా ఉంచుకోవలసిందిగా నొక్కి వక్కాణిస్తున్నాము.

హెల్త్ ఆఫీసర్‌వారి వద్దనుంచి ఎవ్విధమయిన సమాచారమూ లేనప్పుడు, మీరేం చేస్తున్నట్టు? తక్షణం ఒక స్పెషల్ మెసెంజర్ (ప్రత్యేక వార్తా హరుడు)ని పంపించి, పరిస్థితులు యావత్తూ సమగ్రంగా నివేదించి, వారిని తోడ్కొనివచ్చి ఏదో ఆ పని అయిందనిపించడమా? లేక గోళ్ళు గిల్లుకుంటూ కిమన్నాస్తిగా కూర్చోవడమా? మీ వ్యవహారం మాకు ఎంత మాత్రం తృప్తికరంగా లేనేలేదు. జవాబు జరూరు.

—చీఫ్ డివిజనల్ ఆఫీసర్."

8 జనవరి 1984


×× ×× ××

"చీఫ్ డివిజనల్ ఆఫీసర్ గారికి . . .

అయ్యా,

ఇంతవరకూ హెల్త్ ఆఫీసర్‌గారు కాని, వారి సిబ్బంది కాని విచ్చేయడం జరగలేదు. అథవా సమాచారమయినా అందలేదు. ఈలోపుగా నూకలు కుళ్ళి, కృశించిపోయి, పుచ్చిపోయి, పురుగులు పట్టి, అతి శోచనీయ, కడు దైన్యావస్థలో ఉండడమే కాక చివికి, శిథిలమై, చూర్ణమై మహా అయోమయ పరిస్థితిలో ఉండడమే కాకుండా దుర్భర దుర్వాయువులు బయలుదేరి ప్రపంచాన్ని ముంచెత్తుతాయేమో అన్న భీతాహంతో మేము దద్దరిల్లుతున్నాము. క్రమన్య ఈ జబ్బు మిగిలిన బస్తాలకు కాని సోకితే మన గోడౌన్‌ని నిర్మొగమాటంగా, నిర్దాక్షిణ్యంగా కాల్చివెయ్యడం తప్పిస్తే గత్యంతరం లేదు. తరువాత బహుశా అంటు రోగాలు పట్టణం అంతటా వ్యాపించి, దానికి తోడు ఈ దుర్గంధపూరిత విషవాయువు పట్నాన్ని రూపుమాపితే పోయినవాళ్ళు పోగా, ఉన్న వాళ్ళు—ఎవరైనా అప్పటికి ఉంటే—మన డిపార్టుమెంట్ మీద 'కల్పబుల్ హోమిసైడ్' (నిర్లక్ష్యమయిన చర్యల మూలంగా ప్రాణోపద్రవం కల్పించడం) లాంటి చార్జీ లేమయినా పెడతారేమో అన్న మహాభీతి చేతనూ, మీకు వెంటనే తెలియజేస్తే పెద్ద ఎత్తున తగు చర్యలు సత్వరంగా తీసుకుంటారేమో అన్న పేరాశవల్లనూ, లేఖ రాస్తే 'ఆలస్యం అమృతం విషం' అనిన్నీ ఇలాంటి గడ్డు పరిస్థితుల్లో ఎక్స్‌ప్రెస్ టెలిగ్రామ్ ఇవ్వకపోతే ఎందుకు ఇవ్వలేదని చర్య తీసుకుంటారేమో నన్న భయంతో ఎక్స్‌ప్రెస్ టెలిగ్రామ్ పంపడమయినది. దీనికి క్షమాపణ కోరుకుంటున్నాను.

టెలిగ్రామ్‌లో 'గోనె పాడైపోయింది' అని తప్ప ఎక్కువ వివరాలు రాస్తే టెలిగ్రామ్ పెద్దదౌతుంది. టెలిగ్రామ్‌లో అనవసరంగా అనాలోచితంగా ఎక్కువ మాటలు ఉపయోగించి, ఎక్కువ ధనాన్ని దుర్వినియోగపరిచార




బి. ఆంథోని

రు. 116 లు బహుమతి పొందిన కార్టూన్

న్న ఆడిట్ అబ్జెక్షన్ (ఖర్చు అజమాయిషీ చేసేవారి గోల) నుంచి తప్పించుకోడానికి ఆ వివరాలు అందజెయ్యలేక పోయాము. నూకల గోనె చిరిగిపోయి, కన్నాలు పడి, తాకితేనే చాలు నుగ్గు నుగ్గు అయిపోతుందేమో అన్నట్లు తయారై అవసానదశలో ఉంది. మరి కొన్నాళ్ళు పోతే నామ రూప వర్ణవస్తురహితంగా నిశ్చల స్థితిలో పడి, నిష్కారణంగా పొడి పొడి అయి రాలిపోతుందేమో అన్న చిన్న శంకతో బాధ పడుతున్నాము.

హెల్త్ ఆఫీసర్‌గారి దగ్గరికి స్పెషల్ మెసెంజర్ని తగు శిక్షణ ఇచ్చి పంపాము. 'నువ్వెళ్ళు. మేం తర్వాత హుటాహుటిని వస్తాం' అని వారు మెసెంజర్ని పంపేశారు. స్పెషల్ మెసెంజర్ తిరిగివచ్చి పక్షం రోజులు పైగా అయింది. హెల్త్ ఆఫీసర్‌గారు కాని, వారి అసిస్టెంట్ కాని, లేక వారి సబ్-అసిస్టెంట్ కాని, అథవావారి డెప్యూటీ సబ్-అసిస్టెంట్ కాని, కనీసం వారి అసిస్టెంట్ డెప్యూటీ సబ్-అసిస్టెంట్ కాని ఇంత వరకూ రాలేదు. వారి అతీ గతీ తెలియదు. మాకు తలా తోకా అందకుండా ఉంది.

భయాందోళనా విహ్వల చంచల భ్రమణాయత్త మత్త చిత్తంబుతో తత్తర పడుచున్న...

భవద్విధేయుడు

- అసిస్టెంట్ డివిజనల్ ఆఫీసర్."

30 జనవరి 1984

×× ×× ××

క్లియర్‌లైన్ ఎక్స్‌ప్రెస్ టెలిగ్రామ్ . . .

"హెల్త్ ఆఫీసర్ గారికి . . .

కాపీ: అసిస్టెంట్ డివిజనల్ ఆఫీసర్‌కి . . .

పుచ్చిన నూకలు వెంటనే తనిఖీచేయ ప్రార్థన. కొంపలంటుకున్నాయి.

—ఛీఫ్ డివిజనల్ ఆఫీసర్."

5 ఫిబ్రవరి 1984

×× ×× ××

లేఖ . . .

"ఛీఫ్ డివిజనల్ ఆఫీసర్ వారికి...

అయ్యా,

ఈ రోజు శుభదినము. ఎందుకంటే—ఈ దినము హెల్త్ ఆఫీసర్‌గారి అసిస్టెంట్ డెప్యూటీ సబ్-అసిస్టెంట్‌గారి పెర్సనల్ అసిస్టెంట్‌గారు విచ్చేసి నూకలను సాకల్యంగా, సవిమర్శంగా, సమగ్రంగా, ఆమూలాగ్రంగా పరీక్షించినారు. నూకలు పుచ్చిపోయి పురుగులు కారుతూండడంలో ఏమీ సందేహము లేదనిన్నీ, పాషాణ విషతుల్యమని చెప్పడానికి శంకించవలసిన అగత్యం లేదనిన్నీ, నిశ్శేషంగా భూస్థాపితం చెయ్యడమే సర్వోత్తమమయిన మార్గమనిన్నీ ధ్రువపత్రము (సర్టిఫికెట్) ఇచ్చినారు. తమరు గమనించే నిమిత్తం అది ఇందుతో జతపర్చడమయినది. తరువాతి కార్యక్రమాన్ని నిర్ణయింతురు గాక!

హర్ష ప్రపూరితాత్ముండయిన,

భవద్విధేయుడు,

- అసిస్టెంట్ డివిజనల్ ఆఫీసర్."

25 మార్చి 1984

×× ×× ××

టెలిగ్రామ్ . . .

"అసిస్టెంట్ డివిజనల్ ఆఫీసర్‌కి...

నూకలను...అంటే ఒకప్పుడు నూకల రూపంలో ఉండిన ఆ వస్తు సముదాయాన్ని, గోనెను...అంటే—డిటో—భూమిలో తవ్వి పాతిపెట్టి పాతర వెయ్యవలెను. అలా చేసిన మరుక్షణం మాకు తెలియజెయ్యవలెను.

—ఛీఫ్ డివిజనల్ ఆఫీసర్."

23 ఏప్రిల్ 1984

×× ×× ××

లేఖ . . .

"ఛీఫ్ డివిజనల్ ఆఫీసర్ వారికి...

అయ్యా,

మీ ఆజ్ఞానుసారమే నూకలను, గోనెను భూస్థాపితం చెయ్యడమయినది. ఈ కార్యక్రమంలో కొంత కాలవిలంబన అనివార్యమైంది. గొయ్యి తవ్వడానికి తగిన జాగా గురించి సర్వే చేయించడంలో కొన్నాళ్ళూ, జాగా దొరికిన తరవాత ఆ జాగాని ఖరీదు చెయ్యడంలో కొన్నాళ్ళూ, ఖరీదు చేసినతర్వాత గొయ్యి తవ్వడానికి తగిన గట్టి గునపం గురించి ఇండెంట్ చెయ్యడంలో మరి కొన్నాళ్ళూ, తరువాత గునపం సప్లయి అయిన తరువాత తవ్వడానికి ప్రత్యేకంగా ఒకర్ని నియమించడం కోసం ఆడిట్ శాఖనుంచి శాంక్షన్ రావడంలో ఇంకొన్నాళ్ళూ, ఆ తర్వాత గొయ్యి తవ్వడానికి ప్రారంభోత్సవం చెయ్యడానికి అర్హుడయిన తగు పెద్ద మనిషిని అన్వేషించడంలో మరి కొన్నాళ్ళూ, అటు పిమ్మట—సుముహూర్తంకోసం వేచి ఉండవలసిరావడంవల్లా— ఈమాత్రం కాలవిలంబన తప్పనిసరయింది!

గొయ్యి తవ్వడానికి ప్రారంభోత్సవం నిమిత్తం తగు పెద్ద మనిషి దొరకగానే పని ప్రారంభించక, సుముహూర్తం కోసం ఎందుకు ఎదురుచూశారని మీ రనవచ్చు. ఎంత అణుయుగంలో ఉన్నా, కొన్ని చాదస్తాలూ, సంప్రదాయాలూ విడవడం కష్టసాధ్యం. అదీ కాకుండా, దుర్ముహూర్తంలో పని ప్రారంభిస్తే బెడిసికొట్టి, మళ్ళీ ఇలాంటి కేసు ఉద్భవించి పీకలమీదకి వస్తుందేమో నన్న ముందు చూపుతో సుముహూర్తంలోనే ప్రారంభించాము.

ఇవన్నీ ఇప్పటికి నిర్విఘ్నంగా పరిసమాప్తి పొంది నిన్ననే ఆ నూకల్నీ, గోనెనీ భూస్థాపితం చేసి, వాటికి శాశ్వతమయిన ప్రశాంతిని కల్పించాము. ఇప్పటికి ఈ 'నూకోదంతం' ముగిసింది.

శంకుస్థాపన జరిగినంత త్వరగా భూస్థాపితం జరగనేరదని తమకు వేరుగా చెప్పనక్కరలేదు గదా?

బ్రహ్మానంద కోలాహల సంభరిత ప్రహృష్ట మానస మానస సరోవర పటు వీచికా పటలుండగు,

భవద్విధేయుడు,

- అసిస్టెంట్ డివిజనల్ ఆఫీసర్."

31 డిసెంబర్ 1984.